# కనీసపు కోర్కెలు

శ్రీమతి ద్వివేదుల విశాలాక్షిగారు

వచ్చి పదిరోజులైనా ఆనాటివరకు నాకు ఆ ఇంట్లో ఎవరితోనూ పరిచయం కాలేదు. మావారు వుదయము పదిగంటలకు భోజనముచేసి ఆఫీసుకు వెళితే సాయంకాలముదాకా తిరిగివచ్చేవారుకారు. ఇంట్లో పనివున్నంతసేపు పనిచేసుకొని తీరుబడిగా వున్నప్పుడు ఏదో పుస్తకము చదువుకొని కాలక్షేపం చేసేదాన్ని. ఆ ఇంట్లో నాలుగయిదు కుటుంబాలవాళ్ళు కాపురమున్నారు. సాయంకాలము కాగానే వారంతా వంటలు చేసుకొని ఎక్కడెక్కడో తిరిగి రాత్రికి ఇంటికి చేరేవారు. వాళ్లు ఎక్కడికి వెళుతున్నారో నేనడగలేదు. తమతో రమ్మని వాళ్లు నన్ను పిలవనూలేదు. అసలు వాళ్లు నన్ను పలకరిస్తేగా! ఇంత ముభావంగా ఇలా వుంటారెందుచేతని మావారి నడిగితే "ఇవన్నీ బస్తీ అలవాట్లు; నువ్వూ నేర్చుకో" అన్నారు. ఆ రోజు మామూలుగా వంట పూర్తిచేసుకొని తల దువ్వుకొంటున్నాను. మాపక్క వాటాలో వున్న సుందరమ్మగారు (అలాగని అందరూ పిలవగా విన్నాను.) వచ్చారు. "ఏమండీ మాణిక్యమ్మగారు ఈ రోజున మహిళా మండలిలో మీటింగున్నాది. మీరు కూడా రాకూడదా? అలా పూరకనే కూర్చోకపోతే" అన్నారు. "సాయంకాలము మావారొచ్చేసరికి నేనింటిదగ్గర వుండకపోతె చిరాకుపడుతారు. నేను రానండీ" అన్నాను. మేము ఇలాగ మాట్లాడుకొంటుండగానే మావారి ఆఫీసు బంట్రోతువచ్చాడు. "అమ్మా! అయ్యగారు వచ్చేసరికి ఆలస్యమౌతుందిట. సినీమా కెళతారుట. మీతో చెప్పమన్నారు" అన్నాడు. "ఇంక ఎలాగా మీవారు పది గంటలయితేకాని రారు. ఆ వేళకి మనము వచ్చేద్దాములెండి" అన్నారు సుందరమ్మగారు. ఆవిడ అలా బలవంతపెడుతూంటే కాదనలేక బయలుదేరేను.

ఓ మూడు రిక్షాలలో ఇంట్లోవున్న ఆడంగులమంతా బయలుదేరాము. చాల దూరముపోయి ఒక పెద్దభవనము ముందర రిక్షాలు ఆగేయి. అప్పటి కప్పుడే చీకటి పడుతూ వుండడముచే దీపాలు వెలిగించేరు. ఆ వెలుగులో ఒక ఇంద్రభవనంలాగున్నాది ఆ మందిరం. లోపలికి వెళ్లేసరికి అప్పటికే హాలంతా స్త్రీలతో కిటకిటలాడుతున్నాది. అబ్బా ఎంతమంది. వరదోత్సవములోనూ

ఇంతమంది ఆడవాళ్లను నేను చూడలేదు. అందరికీ కళ్లకి జోళ్లు, కాళ్ళకి జోళ్ళు, రిష్టు వాచీలు ఒకటేమిటి నవీన నాగరకిత అంతా వుట్టిపడుతూవున్నారు. దూరంగా స్టేజి మీద ఎవరో మాట్లాడుతున్నారు. వాళ్లు మాట్లాడేది స్పష్టమైన తెలుగూ కాదు, ఇంగ్లీషూ కాదు. రెండూ కలగలుపు. ఒకరిమీద ఇంకొకరు కలియబడి కొట్టుకుంటారేమో అన్నంత వుద్రిక్తంగా వాదించుకొంటున్నారు. వారు దేనికలా దెబ్బలాడుకుంటున్నారని అడిగేను నా పక్కనేవున్న సుందరమ్మగారిని. "దెబ్బలాటకాదు. స్త్రీలపై పురుషులు చేస్తున్న దౌర్జన్యాన్ని నిరసిస్తున్నారు. ఈ నగరములోగల మహిళలందరూ రేపటినుండి స్ట్రయికు చేస్తున్నారు. దాన్ని ఎలా నడపవమనేదే నేటి మీటింగు వుద్దేశము. ఇందులో ఎవరి అభిప్రాయాలు వారు చెప్పవచ్చు. మీకేమైనా తోస్తే స్టేజిమీదకి వెళ్లి చెప్పండి" అన్నారు. అసలు ఈ స్ట్రయికుఅనే మాటకు సరిగా అర్థమేనా తెలియని నేను చెప్పేదేమిటి అనుకున్నాను. కొంతసేపు తర్జన భర్జనలయిన తరువాత అధ్యక్షురాలు వుపన్యసించేరు. "ఏమిటో సరిగా అర్థంకాకపోయినా మొగవాళ్లు ఆడవాళ్లని బానిసలుగా చూస్తున్నారనీ, వారికి వ్యక్తిస్వాతంత్రము లేకుండా చేసేరనీ, వాళ్లకి (స్త్రీలకి) తగిన ఆర్థిక స్థోమత లేకపోవుటే దానికి కారణమనీ, స్త్రీ పురుషునితో సమంగా ఆర్జించగలిగిననాడు పురుషుడు స్త్రీని ఇంత చులకనగా చూడలేడనీ, అందుకు స్త్రీ విద్య ఎంతేనా అవసరమనీ, ప్రతి గృహిణీ దినములో కొంత కాలము విద్యకొరకు వుపయోగించుకోడానికి వీలుగా వుండాలనీ, ఇంటిలో పనులు చేయుటకు కాలనిర్ణయము వుండాలనీ, అటులకాక రాత్రింబగళ్లు ఎద్దులా చాకిరీ చేయుట వలన ఆరోగ్యము పాడయి స్త్రీ ఏపని యందు ఆసక్తి చూపలేక పోవుచున్నదనీ, ప్రతివారికున్నట్లుగానే స్త్రీకి వారమునకు ఒక రోజు శెలవూ, దినములో కొన్ని గంటలు విశ్రాంతి అవసరమనీ, అందుకొరకై రేపటినుండి ఈ నగరమునగల మహిళలందరూ స్ట్రయికు చెయ్యాలనీ, మొగవారు ఎంత కోపగించినా, కొట్టినా, తిట్టినా, బ్రతిమాలినా ఈ కోర్కెలు నెరవేర్చెదమని మాట ఇచ్చేవరకు ఇళ్లలో ఏపనీ ముట్టరాదని తీర్మానించడమైనదనీ, ఈ తీర్మానము పూర్తి మెజారిటీతో నెగ్గిందనీ చెప్పేరు. ఇంటి దగ్గర వంటలు చెయ్యక పోవుటచే తప్పనిసరిగా నిరాహార దీక్ష పూనవలసి వస్తుందనీ, అందుకు అందరూ సిద్ధముగా వుండాలనీ" చెప్పేరు. మహిళామండలి జిందాబాద్ అనీ, స్త్రీల కనీసపు కోర్కెలు తీరాలీ" అనీ నినాదాలు చేసుకొంటూ అందరూ గుంపుగా బయలుదేరేరు. అంత దూరమునడచి ఇల్లు చేరుకొనేసరికి నాకు కాళ్లు లాక్కొచ్చేయి.

అలానే పక్కమీద కూలబడ్డాను. మరి కొంతసేపటికి మావారువచ్చి ఆకలిగా లేదనిచెప్పి భోజనముచేయకే నిద్ర పోయారు. నేనూ మరి లేవలేదు.

౨

మరునాడు వుదయాన్నే లేచి అలవాటు ప్రకారం కాఫీ పెట్టాలని నిప్పు చేస్తున్నాను. సుందరమ్మగారు గబగబావచ్చి నాచేతిలోని విసనకర్రా, అగ్గిపెట్టె అవతల పారవేసి, కుంపటిలో చెంబుడు నీళ్లుపోసి "ఏమండీ మాణిక్యమ్మగారు! మహిళల స్ట్రయికు సంగతి మరచిపోయారా. నయం నేను చూశాను కాబట్టి సరిపోయింది లేకపోతే ఎంత పనైపోను" అన్నారు. "సుందరమ్మగారూ! ఈ స్ట్రయికులు అవీ మీలాటి చదువుకున్న వారికీకాని మాకేమిటండీ. ఇంట్లో వంటా, పనీ చెయ్యకపోతే ఎలా గడుస్తుంది" అన్నాను, ఈ నాటికి నన్ను వదలివేయండని బ్రతిమాలుకుంటూ. అబ్బే, ఆవిడ వింటేనా! ససేమిరా వల్లకాదంది. ప్రతి ఒక్కరూ ఇలా వెనుకాడితే స్ట్రయికు నెగ్గేదెలా! మహిళల కోరికలెలాతీరుతాయి అన్నారు. అప్పటికే మావాదన విని నిద్రమంచంమీదనుండి లేచివచ్చిన మావారు "అలాగేనండీ, మీస్ట్రయికు పూర్తయేదాకా మా ఆవిడ వంటా, పనీ చేయకుండా నేచూస్తానులెండి" అన్నారు. "నిజంగా మీరు అలాచేస్తే మామహిళలకు చాల తోడ్పడినవారు అవుతారు" అన్నారు సుందరమ్మగారు సంతృప్తిగా. సరే ఇక ఎలాగా తప్పదని చేస్తున్నపనిమాని కూర్చున్నాను. అంతటితో ఆవిడ వదులుతేనా, ఇంట్లోగల ఆడవారి నందరినీ వెంటబెట్టుకొని ఇంటింటికి బయలుదేరింది. గుడికి పోతూన్న మేకపిల్లలా భయపడుతూనే వారి వెంట వెళ్లాను. ఒక ఇంటికి వెళ్ళేసరికి ఆ ఇంటి అత్తా కోడలూ దెబ్బలాడుకుంటున్నారు. సుందరమ్మను చూడగానే ఆ కోడలు "చూడండీ సుందరమ్మగారూ! మహిళల స్ట్రయికు సంగతి చెప్తే నమ్మక నేను పని యెగ్గొట్టడానికి చూస్తున్నానంటున్నారు మా అత్తగారు" అన్నాది. "ఇదేమి సోద్యమమ్మా మానాడు ఇలాటి వెరుగుదుమా? రాత్రనక, పగలనక పనిపాట్లు చేసుకొనేవారము" అన్నాది అత్తగారు. "సూరమ్మగారూ! మీకెందుకీ పనుల గొడవలు, హాయిగ కృష్ణా, రామా అని ఓమూల కూర్చోక? అవి అన్నీ మీకోడలు చూసుకొంటుంది. రామ్మా అమ్మాజీ! అలా వెళ్లి వద్దాం. మామ్మగారూ మీ కోడలొస్తుంది మీరు తొందరపడి వంట చెయ్యకండి" అన్నారు సుందరమ్మగారు.

త్రోవలో కన్పించిన ఒక ముసలితాత "ఏమమ్మా సుందరమ్మా, మా ఇళ్లలో ఇలా ఆరనిచిచ్చుపెడితే నీ కొరిగేదేమిటి. ఇంట్లో ఆడాళ్లు వంటలుచేయకపోతె ఎలాగ?

పిల్లాపీచు కలవాళ్లముగాని నీలావిడివాళ్లము కామే" అన్నాడు. "ఎలాగ తాతగారూ రెండు రోజులోర్చుకోవాలి. మేము వంటలు చెయ్యడము, మానడము మీ పురుషుల చేతిలోనే యున్నది. మా కనీసపు కోర్కెలు తీరుస్తే వెంటనే ఇంటిపనులలో జాయిను అవుతాము" అన్నాది అమ్మాజీ. ఇలా రెండు వీధులు తిరిగే సరికి రెండుఝాములయినది. అందరికీ కడుపులో నకనకలాడుతున్నా, పైకి మాత్రం పెదవి కదల్పక అలాగే తిరుగుతున్నాము. వీధి వీధినుండి ఒక్కొక్క గుంపు వచ్చి కలుస్తున్నాది. ఈ మహిళా సమూహమంతా "మహిళామండలి జిందాబాద్, మహిళల కనీసపు కోర్కెలు తీరాలి" అంటూ నినాదాలు చేసుకొంటూ మహిళా మండలి మందిరమునకు చేరుకున్నారు.

సాయంకాలమువరకు అక్కడ జరిగిన చర్చలలో పిల్లల భోజనము, పోషణ వగైరా సమస్యలు ముఖ్యమైనవి. పెద్దవారి మధ్య జరిగిన ఈ దెబ్బలాటలో నోరులేని పసిపిల్లలు బాధపడకుండునటుల చూడాలని ఒక తీర్మానము ప్రతిపాదించేరు. చాలమంది దానికి అనుకూలముగా ఓటు చేయడముచే తీర్మానము నెగ్గింది. ఇక అది ఎలా అమలు జరపడమనేదే ముఖ్య సమస్య. ఇండ్ల దగ్గర వంటలు చేయకూడదని నియమంకాని, వంటే చేయకూడదని లేదు కాబట్టి ఇక్కడే (అనగా మహిళా మండలి మందిరములోనే) వంటలు చేసిన యడల పిల్లలు, ఆడవాళ్లుకూడా భోజనాలు చేయవచ్చునని తీర్మానించారు. ఇక పిల్లల వయస్సు నిర్ణయిస్తూ పదిహేను సంవత్సరాలు దాటకూడదన్నారు. ఈ కార్యక్రమానికి డబ్బు అవసరము. మహిళా మండలి ఫండు అంత ఎక్కువగాలేదు. అందుచే ఎవరికి తోచినదివారు విరాళాలివ్వాలన్నారు. వొంటినున్న బంగారాలలో ఎవరికి తోచింది వారిచ్చారు. నేనూ మా అత్తవారు ప్రధానమునకు పెట్టిన వుంగరము ఇచ్చేను. మొదట భయపడ్డాను కాని, తరువాత ఇదీ ఒక సరదాగానేవుంది. వూళ్లోవున్న ఆడవాళ్లు, పిల్లలూ ఒకచోట భోజనాలు చేయడమువలన పెళ్లివారిల్లులాగుంది ఆ మందిరము.

రెండవరోజు స్ట్రయికు ప్రారంభమయే సరికి వూళ్లో చెప్పరానంత అలజడి ప్రారంభమైంది. హోటల్సులో భోజనానికి పూటకి మూడురూపాయలు పుచ్చుకొంటున్నారు. కాఫీ హోటల్లలో ఇడ్లీ పావలా, కాఫీ ఆరణాలు. కొంతమంది వంటలు ప్రారంభించి చేతులు కాల్చుకొనీ, కాళ్లమీద గంజివంపుకునీ, హాస్పటల్సుకి పరిగెడుతున్నారు. మూడవరోజు సాయంకాలము పురుషులందరూ టౌనుహాలులో సమావేశమై మహిళల స్ట్రయికు గురించీ, వారు కోరిన కోర్కెల గురించీ చర్చించారు. వెంటనే పదిమంది సభ్యులుగల ఒక ప్రతి

నిధి వర్గము మహిళా మండలి మందిరానికి వచ్చేరు. వచ్చిన పురుషులను ఆదరించి వారు తెచ్చిన సందేశాన్ని సభవారికి తెలియజేసింది అధ్యక్షురాలు. వారు వీరు కొంతసేపు గర్షణపడి తుదకు రాజీ కొచ్చారు. ఆ వాదనలేమిటో నాకు తెలియకపోయినా రేపటినుండి స్ట్రయికు లేదని అధ్యక్షురాలు చెప్పినమాట మాత్రము విన్నాను.

ఏదో సరదాగా నలుగురితోనూ తిరుగుతున్నానుకాని, ఇంటిలో పనిపాట్లుమాని వీధులెంబడి తిరుగుతూండడము నాకు చికాకుగానేవుంది. ఈ మూడు రోజులలోను ఇంటికొకసారి వెళ్ళివస్తానంటే సుందరమ్మగారు వప్పుకోలేదు. మావారికి రానంతసేపేకాని వచ్చిందంటే అధిక కోపము. ఓ అంతట చల్లారదు. ఎందుకు ఈ వూరు వచ్చానురా భగవంతుడా అని విచారించాను. మేము ఇళ్లకు చేరేసరికి రాత్రి పదకొండు గంటలయినది. నన్ను చూడగానే మావారు నవ్వుతూ "మీ ఆడవాళ్ల కోర్కెలు తీరేయూ, ఇంకా ఏమేనా కోరవ వున్నాయా? ఎంతకేనా తగుదురు. ఇంతమంది మగవారిని గడగడలాడించేరు" అన్నారు. వారు కోపము లేక మామూలుగా వున్నందుకు సంతోషించేను. "మీ స్ట్రయికు విజయవంతముగా నెరవేరినందుకు నిన్ను అభినందిస్తున్నా"నన్నారు. నేను ఏమీ మాట్లాడక పోయేసరికి "ఏమలావున్నావు? నేనేమేనా అనుకుంటూనవా? వెఱ్ఱిదానా! సంఘంలో వున్నప్పుడు అందరితో పాటేగాని నీవు ఇంకొకలాగ ప్రవర్తిస్తే బాగుంటుందా? ఇంతకీ విశేషాలేమిటి" అన్నారు. అప్పటికి మెల్లగా తేరుకొని "నాకు ఏమీ తెలియదు, రేపు సుందరమ్మగారినడిగి చెప్తాను" అన్నాను.

## 3

మరునాడు మధ్యాహ్నము భోజనాలయిన తరువాత మా ఇంట్లోవున్న ఆడంగుల మందరము సమావేశమయాము. "మన స్త్రీలలో ఐకమత్యము లేదంటారు, కాని చూడండి ఈ స్ట్రయికు నెలా విజయవంతముగా నడపగలిగేమో" అన్నారు సుందరమ్మగారు. "మూడురోజులయేసరికి దాసోహం అని మనకాళ్లదగ్గర కొచ్చారు మగవాళ్లు. ఆడది తెగించనంతవరకేకాని రంగంలోకొస్తే, వీళ్ళు చేయగలిగిందేమీ లేదు" అన్నాదింకొక ఇల్లాలు. "అయితే సుందరమ్మగారూ! తెలియక అడుగుతున్నాను, ఈ స్ట్రయికువలన మనకు పురుషులిచ్చిన హక్కులేమిటండీ" అన్నాను. "బాగుందమ్మా! నీ వరస, నీలాటిదే రామాయణమంతా విని రామునికి సీత ఏమౌతుందని అడిగిందట. మూడు రోజులూ మాతో తిరిగి, వుపన్యాసాలు విని ఈ పాటిబోధపర్చుకోలేకపోయారా" అని హేళన చేసేరు సుందరమ్మగారు.

"అది కాదండీ మాణిక్యమ్మగారూ! అసలు మనకోరిక లేమిటో మీకు తెలుసా" అన్నాదింకో గృహిణి. "ఏమోనమ్మా నాకేమీ తెలియదన్నాను." "అయితే వినండి చెప్తా" నని సుందరమ్మగారు ఉపన్యాసం ఇస్తున్న పోజులో లేచి నిలబడి "దినములో కొన్ని గంటలు విశ్రాంతి, వారానికి ఒక రోజు శెలవు కావాలని మనము కోరేము. అందుకు పురుషులు 'మీరు కోరినట్లే దినములో కొన్ని గంటలు విశ్రాంతి ఇస్తాము. వారానికి ఒక రోజు శెలవు మీకు కోరేరు. అలా కాక నెలకి మూడు రోజులు శెలవు ఇవ్వడానికి మాకభ్యంతరము లేదు. కాని మూడు రోజులూ ఒకేమారు వాడుకోవాలని ప్రార్థిస్తున్నాము. ప్రతి నెల అలా వాడుకోని వారు సంవత్సరము మొత్తము మీద ఆ శెలవు నెలరోజులవరకు వాడుకోవచ్చునన్నారు. కొంత దారిలో కొచ్చారు కదాయని సమ్మతించి స్ట్రయికు విరమించేము" అన్నారు.

"ఇంతా చేసి ఇదా తేలింది. ఈ హక్కులు మీలాటి విద్యావతుల కిప్పుడు ఇచ్చేరు కాని ఇవి మాకు మా పూర్వులేనాడో ఇచ్చారు" అన్నాను. "ఎలాగా?" అన్నారు అందరూ ఏకకంఠముగా!

"ఏమీ లేదండీ రాత్రి తొమ్మిది లగాయతు తెల్లవారి అయిదు గంటలవరకు విశ్రాంతే, ఇంక పోతే నెలకి బైటుంటే శెలవు మూడురోజులుండనే వుంది. అలా కాక నెల తప్పితే పురిటికి నెలరోజులు శెలవేగా. ఇప్పుడు కొత్తగా వీళ్ళిచ్చిన దేమిటి" అన్నాను.

నామాటవిని అక్కడ కూర్చున్న విద్యావతులందరు నోళ్లు వెళ్లబెట్టేరు. "మీరన్నది నిజమేసుమండీ, తెలుసుకోలేక పోయినాముకాని" అన్నారు సుందరమ్మగారు.

పాత్రుడుగారి
బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును
డాక్టరు పిళ్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 85254.
కుంభకోణము బ్రాంచి: 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.
తిరుచినాపల్లి బ్రాంచి: 15 పుగళియపిళ్లెవీధి, తెప్పకుళం. P. O.
అన్ని మందుల షాపులలోను దొరకును.